www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 26 ఫిబ్రవరి 2023

పశ్చిమ గోదావరి

ఇళ్ల లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి 27న ధర్నా

తణుకు రూరల్ : జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలో జగనన్న, టిడ్కో ఇళ్ల ప్రాంతాలను ప్రాంతాలను సందర్శించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇళ్లకు ప్రభుత్వం రూ.ఆరు లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని, ఇళ్లు ఇచ్చిన ప్రాంతాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు జగనన్న, టిడ్కో ఇళ్లను సందర్శించినట్లు తెలిపారు. పట్టణంలో 7867 మందికి ఇళ్లు ఇస్తే నేటికీ ఒక వెయ్యి కూడా నిర్మాణం పూర్తి కాకపోవడానికి కారణం డబ్బు సరిపోకపోవడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, కె.నాగరత్నం, పి.దక్షిణామూర్తి, టి.ధనలక్ష్మి, శివ పాల్గొన్నారు.

ఆధునికీకరణ తూచ్..!

ఏ ఒక్క పనికీ కానరాని ప్రభుత్వ అనుమతులు

ఊసే లేని టెండర్ల ప్రక్రియ

రూ.900 కోట్లు విలువైన పనులున్నా నిధులు సున్నా

డెల్టా ఆధునికీకరణపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం

ప్రతియేటా రైతుల కష్టాలు వర్ణనాతీతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణ పనులు ఈ ఏడాది లేనట్టేనని తేలిపోయింది. ఏప్రిల్ నెలాఖరుకు కాలువ కట్టేసి పనులు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఏఒక్క పనికీ అనుమతి రాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులకు సిద్ధం కావాల్సిన యంత్రాగం ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో టెండర్ల ఊసే లేకుండాపోయింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ఖరీఫ్‌లో వరద నీరు కిందకు పారక, రబీలో సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఉభయగోదావరి జిల్లాల డెల్టా ప్రాంతంలో దాదాపు 4.60 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. 11 ప్రధాన కాలువలు, 300కు పైగా ఉప కాలువల ద్వారా డెల్టాకు సాగునీరు సరఫరా సాగుతోంది. 2007లో డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి 1464.44 కోట్లకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దశాబ్దన్నర కాలం గడిచినా ఆధునికీకరణ పనులు పూర్తి కాలేదు. ఇంకా రూ.900కోట్లకు పైగా విలువ చేసే ఆధునికీరణ పనులు జరగాల్సి ఉంది. గత ప్రభుత్వాల హయాంలో ప్రతియేటా ఎంతోకొంత పనులు జరిగేవి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా ఆధునికీకరణ పనులు పడకేశాయి. కాలువలపై బ్రిటీష్ కాలం నాటి కట్టడాలతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నారు. కెనాల్ లైనింగ్, స్ట్రక్చర్ రిపేరింగ్ వంటి పనులు ఎప్పటి నుంచో పెండింగ్‌లోనే ఉన్నాయి. పూడికతో నిండిన కాలువలను పూర్తిస్థాయిలో తవ్వాల్సి ఉంది. గడిచిన మూడున్నరేళ్లలో ఏఒక్క పనీ జరగని దుస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతియేటా అన్నదాతకు కష్టాలే

డెల్టా ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కాలువలు పూడికతో నిండటంతో చిన్నపాటి వర్షానికే పొలాల్లో నీరు నిలిచిపోతుంది. ఖరీఫ్‌లో నారుమడుల దశలోనే రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వరదల సమయంలో ఇక పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కాలువలు పూడిపోవడంతో నీరు కిందకు పారక పొలాల్లో రోజులు తరబడి వరద నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో పంటంతా కుళ్లిపోయి దెబ్బతింటుంది. ప్రతియేటా పంటలు దెబ్బతినడం ప్రభుత్వం అరకొరగా నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం సర్వసాధారణమైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కౌలురైతులే 75 శాతం సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారం సైతం కౌలురైతులకు అందడం లేదు. ఆధునికీకరణ పనులు జరిగి ఉంటే పొలాల్లో నీరు త్వరితగతిన తగ్గి పంట దెబ్బతినే పరిస్థితి ఉండదు. ప్రతియేటా లక్షల ఎకరాల్లో పంట దెబ్బతింటున్నా ప్రభుత్వానికి మాత్రం ఆధునికీకరణ గురించి పట్టడం లేదు. ఇక రబీ సాగుకు వచ్చేసరికి సాగునీరు అందక రైతుల పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుత రబీలో కొనసాగుతున్న పరిస్థితే అందుకు నిదర్శనం. గోదావరి జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో సీలేరు జలాలపైనే రబీ సాగు నడుస్తోంది. కాలువ పరిధిలో ఆయకట్టుకు ఐదు రోజుల చొప్పున వంతులవారీ విధానం అమలవుతోంది. కాలువలు మెరకదేరిపోవడంతో నీరు కిందకు పారక వంతులవారీ విధానంలో పొలాలకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లతో పంటను కాపాడుకోవాల్సి దుస్థితి నెలకొంది. దీనంతటికీ ప్రధాన కారణం ఆధునికీకరణ పనులు జరగకపోవడమే. తమ్మిలేరుకు సంబంధించి ఆధునికీకరణ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేయకపోవడంతో చిన్నచిన్న పనులు చేసేందుకు సైతం కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జడ్జిచే మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బివిఆర్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషా లక్ష్మీకుమారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోపాటు మరుగుదొడ్లు తదితర సదుపాయాలపై ఆరా తీశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పర్యవేక్షకులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థితిలో ఉండాలని కోరారు.

మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న జడ్జి ఉషా లక్ష్మీకుమారి

సాగునీటి చౌర్యాన్ని అరికట్టండి

ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ

ప్రజాశక్తి - ఆచంట

సాగునీరు ఆక్వా చెరువులకు మళ్లించకుండా సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకు సాగాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ అన్నారు. శనివారం ఆచంట, బాలంవారిపాలెం, ఆచంట వేమవరం, కొడమంచిలిలోని గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యంగా నీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిపారుదల శాఖ విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరించి తొలుత తాగునీటి చెరువులు నింపాలన్నారు. నీటి సరఫరాపై సచివాలయం, రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సూర్యతేజ ఆదేశించారు. బాలంవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యులు ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లో రోగులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాలు, వాటిలో నిర్మిస్తున్న ఇళ్లు, నిర్మాణం ప్రారంభించని ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం తక్షణం చేపట్టేలా చర్యలు చేపట్టాలని సూర్యతేజ ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజ్యలక్ష్మి, పంచాయతీ ఇఒ నాగబాబు, బాలంవారిపాలెం సచివాలయ సెక్రెటరీ పుచ్చకాయలు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, హౌసింగ్ ఎఇ శ్రీరాములు, నరేష్, ఆర్ఐ లలిత, విఆర్ఒ ఆచంట సీతారాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొడమంచిలిలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని సూర్యతేజ పరిశీలించారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సూర్యతేజ

ఆలోచనలకు పదునుపెడితే అద్భుత ఆవిష్కరణలు

నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి - నిట్‌లో ముగిసిన ఉల్కన్ జి ఉత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆలోచనలకు పదునుపెడితే అద్భుత ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయని, విద్యార్థులు విజయాలే లక్ష్యంగా వ్యూహాలకు పదునుపెట్టాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి తెలిపారు. నిట్ ప్రాంగణంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ముఖ్యమేనన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ సాకారం చేసేందుకు విద్యార్థులు సమిష్టిగా పని చేయాలన్నారు. ప్రజల ఆశలను, ఆకాంక్షలను ప్రతిబింబించేలా విభిన్న పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ప్రాంగణ ఎంపికల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. యువత నచ్చిన వృత్తుల్లో రాణించాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని, ఈ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని వివరించారు. విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్‌షో, ర్యాంపువాక్ ఆహుతులను ఎంతగానో అలరించాయి. విద్యార్థుల హుషారైన గీతాలకు, నృత్యాలకు విద్యార్థులు ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్య, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ తలారి రేష్మ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ రాముడు పాల్గొన్నారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఇంటి నిర్మాణ రుణం రూ.5 లక్షలకు పెంచాలి

ఆర్‌డిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదలు జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో నిర్మించుకునే ఇళ్లకు ఇచ్చే రుణం రూ.ఐదు లక్షలకు పెంచాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మండలంలోని వెంప గ్రామంలోని కొత్తపేటలో జగనన్న కాలనీని ఆర్‌డిఒ దాసి రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత శ్రీనివాస్ పలు సమస్యలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించి రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు సదుపాయం కల్పించాలన్నారు. సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.



జనంతో మాట్లాడుతున్న దాసి రాజు

వైద్యాధికారి గులాబ్ రాజ్‌కుమార్‌పై విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

వైద్యాధికారి, సిబ్బందికి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ భానునాయక్ సూచించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్‌పై వచ్చిన ఫిర్యాదులపై భాను నాయక్‌తోపాటు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ డి.సుధ శనివారం విచారణ నిర్వహించారు. వైద్యాధికారి గులాబ్ రాజ్‌కుమార్ పనితీరు మార్చుకోవాలని ఈ నెల 13న కాళ్ల పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. డిఎంహెచ్ఒ శాఖాపరమైన విచారణకు ఆదేశించడంతో విచారణాధికారులకు ఆశాలు తమ సమస్యలను, డాక్టర్ తీరును వివరించారు. సెలవు కోసం వెళ్తే డాక్టర్, వైద్యసిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆశాలు వాపోయారు. దీనిపై విచారణాధికారి స్పందిస్తూ ఆశాలు ఎఎన్ఎం వద్ద సెలవుకు అనుమతి తీసుకోవాలని, వైద్యాధికారి, వైద్య సిబ్బందికి ఎటువంటి డబ్బులూ ఇవ్వొద్దని సూచించారు. డబ్బులు అడిగితే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. డాక్టర్‌పై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి తుది నివేదిక డిఎంహెచ్ఒకు అందజేస్తామన్నారు. ఈ విచారణలో ఆశా వర్కర్ల నోడల్ ఆఫీసర్ బాలు, కాళ్ల పిహెచ్‌సి నోడల్ అధికారి జ్యోతి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పెద్దిబోయిన కృష్ణవేణి, కోశాధికారి ఎస్.రేవతి, ఆశాలు వి.పైడితల్లి, యు.రజిని, ఇ.లక్ష్మి, సిహెచ్.చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆశాల వివరాలు తెలుసుకుంటున్న విచారణాధికారులు

బాల్య వివాహాలపై ఉక్కుపాదం

ఐసిడిఎస్ పీడీ సుజాతరాణి

ప్రజాశక్తి - వీరవాసరం

బాల్య వివాహాలు చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఐసిడిఎస్ పిడి సుజాతరాణి హెచ్చరించారు. బాల్య వివాహాల పై అవగాహన సదస్సును శనివారం వీరవాసరం ఎంఆర్‌కె. జిల్లాపరిషత్ హైస్కూల్ నందు నిర్వహించారు. ఐసిడిఎస్ భీమవరం సెక్టార్ సూపర్‌వైజర్ వాణివిజరత్నం అధ్యక్షతన జరిగిన సదస్సులో సుజాతరాణి మాట్లాడుతూ మారిన సమాజ పోకడల పట్ల బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్యవివాహాలు జరిగితే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్యవివాహాల వల్ల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర దుష్ప్రభావాలు పడతాయన్నారు. యువతికి 18 సంవత్సరాలు, యువకునికి 21 సంవత్సరాలు నిండాకే వివాహాలు చేయాలన్నారు. ఈ సదస్సులో ప్రధానోపాధ్యాయిని బి.ప్రభామంజిరి, ఎస్ఐ వీరభద్రరావు, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, విద్యార్థులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ సుజాతరాణి

డెల్టాకే వరుస పదవులు.. మెట్ట సంగతేమిటో..!

సాగునీటి సమస్యను పట్టించుకునే వారేరీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి నామినేషన్ల ప్రక్రియ పరిశీలన దశ దాటింది. ఉపసంహరణ ప్రక్రియ సాగుతోంది. ఏదేమైనా సోమవారం సాయంత్రం నాటికి ఎన్నికలు జరుగుతాయా లేక ఏకగ్రీవమా అనేది తేలిపోనుంది. అయితే అభ్యర్థిత్వాల ఖరారులో వైసిపి అధిష్టానం అనుసరించిన వ్యూహం, ప్రధాన ప్రతిపక్షం టిడిపి తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం చర్చనీయాంశాలుగా మారాయి.

స్థానిక సంస్థల కోటాలో పాలకొల్లు నుంచి ఒకరికి అవకాశం దక్కుతుందని మొదటి నుంచి వైసిపి నేతలు అంతా భావించారు. ఎంఎల్‌సి రేసులో మేకా శేషుబాబు, గుణ్ణం నాగబాబు ఉండటంతో నాగబాబుకే అవకాశం దక్కుతుందని అంతా ఊహించారు. అయితే అనుహ్యంగా జెడ్‌పి ఛైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని అధిష్టానం ఖరారు చేయడంతో అంతా ఆశ్చర్యచకితులయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఎంఎల్ఎ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సిగా అవకాశం ఇవ్వడం అధిష్టానం వ్యూహమేనని తెలుస్తోంది. పాలకొల్లు నియోజకవర్గంలో కాపుల ఓటింగ్ ఎక్కువ. ఆ రీత్యా అక్కడ టిడిపి నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును ధీటుగా ఎదుర్కోవాలంటే అనివార్యంగా అదే సామాజిక తరగతికి చెందిన వారికి టిక్కెట్ ఇవ్వాలని అధినేతల ఆలోచనగా తెలుస్తోంది. ఆ రీత్యా కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సిగా అవకాశం ఇచ్చి ఎంఎల్ఎ అభ్యర్థిత్వం నుంచి పక్కన పెట్టేందుకు వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో నాగబాబుకు ఎంఎల్‌సిగా అవకాశం ఇస్తే మేకా శేషుబాబు ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగే సూచనలు కన్పించాయి. దీంతో మధ్యేమార్గంగా కవురును ఎంఎల్‌సిగా పంపడం ద్వారా శేషుబాబుకు తాత్కాలికంగా బ్రేక్ వేయడం, ఎంఎల్ఎ అభ్యర్థి రేసు నుంచి కవురును తప్పించి నాగబాబుకు అవకాశం ఇవ్వడం ఒకే దెబ్బకు రెండు పిట్టలు చందంగా అధిష్టానం వ్యవహరించిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే రెండు ఎంఎల్‌సి పదవులు పశ్చిమగోదావరి పరిధిలోని వారికే ఇవ్వడం ఇటు ఏలూరు జిల్లాలోని నేతలను నిరాశకు గురి చేసింది. ఇప్పటికే ఏలూరు జిల్లా నుంచి మంత్రులు కాదుకదా. కనీసం రాష్ట్ర స్థాయి క్యాబినెట్ హోదా కలిగిన పదవులు కూడా లేవు. ఈ క్రమంలో కచ్చితంగా ఈసారి ఎంఎల్‌సి పదవి ఏలూరు జిల్లాకు కేటాయిస్తారని అంతా ఆశించారు. స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి అవకాశం ఇవ్వకపోయినా కనీసం ఎంఎల్ఎ కోటాలో ఇస్తారనుకుంటే అదీ ఇటీవల ఏలూరు జిల్లాలో విలీనమైన కొల్లేరు ప్రాంత వ్యక్తికీ, అదీ టిడిపి నుంచి వచ్చిన జయమంగళ వెంకటరమణకు పదవి కట్టబెట్టడం ఏలూరు జిల్లాలోని వైసిపి శ్రేణులను మరింత కుంగదీసింది. ఈ క్రమంలో కనీసం జెడ్‌పి ఛైర్మన్ పదవైనా ఏలూరు జిల్లా పరిధిలో వారికి కట్టబెడతారా.. లేక అదీ గతంలో మాదిరి డెల్టా ప్రాంతవాసికి కట్టబెడతారా అనే చర్చ వైసిపి శ్రేణుల్లో పెద్దఎత్తున సాగుతోంది.

నేతలంతా ఎంఎల్‌సి ఎన్నికల హడావుడిలో ఉంటే రైతులు సాగునీటి కోసం నానావస్థలు పడుతున్నారు. దాళ్వా సాగుకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రతి ఎకరాకూ నీరందిస్తామని చెప్పిన మంత్రులు సాగునీటి సమస్యపై నోరు మెదపకపోవడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. వంతులవారీ విధానం కూడా సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో పొలాలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని నీటిని తోడి వరిపైరును రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం సమస్యను మరింత జఠిలం చేస్తోంది. ప్రధానంగా సాగునీరు పంపిణీలో అధికార పార్టీ పెద్దల జోక్యం, నీటి మళ్లింపు కారణంగానే సమస్య తీవ్రతకు కారణమని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులందరికీ అవసరమైన సాగునీరందేలా చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో నీరందక దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

నాడు-నేడు పనులను వెంటనే ప్రారంభించాలి : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని యర్రంశెట్టి వారిపాలెంలో ఉన్న జెడ్‌పి హైస్కూల్‌లో నాడు-నేడు పనులను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం ఆ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ స్థానిక రాజకీయ కారణాలతో నాడు-నేడు పనులు కొన్ని నెలలుగా ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. తరగతి గదుల్లేక మూడు సంవత్సరాలుగా విద్యార్థులు ఆరు బయటే కూర్చుని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొందన్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా పాఠశాల నిర్మాణం ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు ఎమ్‌డి.జాన్ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన ఇనుము, సిమెంట్ ఇప్పటికే సగం దెబ్బతిన్నాయన్నారు. ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపి పనులు ప్రారంభించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఫణీంద్ర, సాయికృష్ణ పాల్గొన్నారు.

తరగతి గదులు సరిపోక భవనం వరండాలో నిర్వహిస్తున్న తరగతులు

వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సిని డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు శనివారం సందర్శించారు. ఫార్మశీలో మందులు, రక్త పరీక్షలు చేసే ల్యాబ్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో డెలివరీ రూమ్, రోగులు కూర్చునే గది, కట్లు కట్టే ప్రాంతాలను కూడా తనిఖీ చేశారు. ఆసుపత్రికి సంబంధించి అన్ని రికార్డులూ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జగ్గన్నపేటలో జరుగుతున్న యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమం, పెదతాడేపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను సందర్శించి పలు సూచనలు చేశారు.

నిస్వార్థ రాజకీయ నేత సర్రాజు

సంతాప సభలో నేతలు

ప్రజాశక్తి - ఉండి

నిస్వార్థ రాజకీయాలు చేసి ఉండి నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు పాతపాటి సర్రాజు అని పలువురు నాయకులు అభివర్ణించారు. శనివారం స్థానిక కోట్ల ఫంక్షన్ హాలులో వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్రాజు సంతాప సభలో పలువురు వైసిపి నాయకులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొని మాట్లాడారు. తొలుత సర్రాజు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ సర్రాజు లేని లోటు ఆయన కుటుంబానికి, పార్టీకి, నియోజకవర్గ ప్రజలకు తీరనిదని అన్నారు. టిడిపి ఆవిర్భావం తర్వాత ఉండి నియోజకవర్గంలో 2004 ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించారన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరినీ పేరు పెట్టి పిలిచి ఎంతో గౌరవించేవారన్నారు. సర్రాజు కుటుంబ సభ్యులకు వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులు రామకృష్ణరాజు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర


రామకృష్ణరాజు (ఫైల్)

రిటైర్డ్ ఉపాధ్యాయులు ఇందుకూరి రామకృష్ణరాజు(75) పెనుమంట్రలో ఆయన స్వగృహం వద్ద శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన పోలమూరు ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయులుగా పనిచేశారు. పోలమూరు, మాముడూరు, పెనుమంట్ర గ్రామాల్లో విద్యార్థులను క్రమశిక్షణగా తీర్చిదిద్దటంలో కృషి చేశారని ఆయన వద్ద విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు కొనియాడారు. రామకృష్ణరాజుకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందింది. రామకృష్ణరాజు మృతికి పోలమూరు గ్రామం మాజీ సర్పంచి కేతా గోపాలన్ సంతాపం తెలిపారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనిల్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పోలమూరు సచివాలయం-2 గ్రేడ్ 5 కార్యదర్శిగా పనిచేస్తున్న కె.అనిల్‌కుమార్‌కు గ్రామపంచాయతీ పూర్తి అదనపు బాధ్యతలను ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శి ఎస్.మోహన్‌రావు శనివారం అప్పగించారు. ఈ నెల 22వ తేదీన కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలో జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఈ మేరకు అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సమావేశాలు, పారిశుధ్య, తాగునీరు, సిబ్బంది పనితీరు, పంచాయతీ వ్యవహారాలు, స్పందన వంటి వాటిని అదనపు బాధ్యతలుగా కె.అనిల్‌కుమార్ స్వీకరించారు.

నేడు లయన్స్ క్లబ్‌ల ప్రాంతీయ సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 26వ తేదీ ఆదివారం పాలకొల్లు లయన్స్ క్లబ్‌ల ప్రాంతీయ సమావేశం పాలకొల్లు లయన్స్ కమిటీ హాలులో నిర్వహిస్తున్నట్లు లయన్స్ రీజియన్ ఛైర్మన్ కారుమూరి రామలింగేశ్వరరావు చెప్పారు. లయన్స్ క్లబ్ హాలులో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో రీజియన్ లయన్స్ క్లబ్‌లు పాల్గొంటాయని చెప్పారు. ఈ సందర్భంగా రూ.ఏడు లక్షల విలువైన కుట్టుమిషన్లు, గ్రైండర్లు, సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - అత్తిలి

ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం భవన కార్మికులు (మేస్త్రీలు)తో మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కె.మురళీకృష్ణ మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు కావాల్సిన ముడిసరుకు, మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, హౌసింగ్ వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోడూరు : జగనన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ బలరామరాజు సూచించారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో మండలంలోని గుమ్ములూరు శివారు రావిగొప్పులో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంకా పనులు ప్రారంభించకపోవడంపై అరా తీశారు. పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

అర్హత ఉంటేనే అధికారులు పట్టా ఇచ్చారు

నెగ్గిపూడి సర్పంచి ధనలక్ష్మి

ప్రజాశక్తి - పెనుమంట్ర

తన కమార్తె జక్కంపూడి వెంకటలక్ష్మికి అర్హత ఉంటేనే అధికారులు పరిశీలించి ఇంటి పట్టా ఇచ్చారని నెగ్గిపూడి పంచాయతీ సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి చెప్పారు. అనర్హులు లబ్ధి పొందుతున్నారని గ్రామస్తులు కట్టా ప్రమీలకుమారి, ఇంజమూరి సత్యవతి తహశీల్దార్ దండు అశోక్‌వర్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై సర్పంచి శనివారం ధనలక్ష్మి స్పందించారు. సర్పంచిగా గ్రామ అభివృద్ధి చేసేందుకు సహకరించకపోగా కొంత మంది తమపై కావాలని ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె అన్నారు. తమ కుమార్తె సుమారు 11 నెలల క్రితం మూడు దఫాలుగా ఇంటి పట్టా కోసం స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుందని, అధికారులు పరిశీలించిన అనంతరం పట్టా ఇచ్చారని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - అత్తిలి

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) ఎస్ఐ బి.సత్యనారాయణ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో నాటు సారా, డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే పరిణామాలపై మహిళా పోలీసులకు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు గ్రామీణ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివివిఎస్.రామారావు పాల్గొన్నారు.

ఎఎస్ఎన్ఎం కళాశాలలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాలకొల్లు రూరల్ లయన్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వికె.మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా లయన్స్ రీజినల్ చైర్‌పర్సన్ కె.రామలింగేశ్వరరావు హాజరయ్యారు. క్లబ్ ప్రెసిడెంట్ గూడూరి హనుమంతరావు, కార్యదర్శి నిట్టల శైలజ, కోశాధికారి కుక్కల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆగర్రులో 'ఇదేం ఖర్మ'...

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఆగర్రు గ్రామంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం అమ్ముకునే దిక్కు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామంలో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రెసిడెంట్ కోడి విజయభాస్కర్, కలిదిండి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధాకర్

ప్రజాశక్తి - తణుకు

తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్‌ను టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంఎ ల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సుధాకర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సుధాకర్‌ను టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ బసవ రామకృష్ణ, తోట సూర్యనారాయణ, గుబ్బల శ్రీనివాస్ పలువురు అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వృద్ధి

డిఆర్‌డిఒ శాస్త్రవేత్త బి.వి.రవికుమార్



క్రానికల్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డిఆర్‌డిఒ శాస్త్రవేత్త బి.వి.రవికుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మేకిన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్‌తో భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో వృద్ధి సాధించి విదేశాలకు కూడా రక్షణ ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని డిఆర్‌డిఒ శాస్త్రవేత్త, ఎస్ఆర్‌కెఆర్ పూర్వ విద్యార్థి డాక్టర్ బి.వి.రవికుమార్ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సహకారంతో రెండు రోజులు పాటు జరిగే 'అపూర్వ 23' వర్క్‌షాప్‌లో మొదటి రోజు శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బిఆర్‌కె.వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ రక్షణ రంగానికి సంబంధించి 80 శాతం ఉత్పత్తులు భారతలోనే తయారవుతున్నాయని, ఇదంతా మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి అని అన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో డిఆర్‌డిఒ తయారుచేసిన డీ2జి డ్రగ్ కరోనా నివారణకు ఎంతగానో ఉపయోగపడిందని వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు కోర్ గ్రూపునకు ప్రాధాన్యత ఇచ్చి విస్తృత పరిశోధనలకు ముందుకు రావాలని కోరారు. తాను ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకుని పరిశోధనా రంగంలో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో కోర్ గ్రూపునకు ఎన్నో అవకాశాలు పరిశ్రమల నుండి అందుతున్నాయని చెప్పారు. తాజాగా ఒక పరిశ్రమ తమ కళాశాలకు చెందిన 107 మంది విద్యార్థులను రూ.పది వేలు వేతనంతో ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేసిందని వివరించారు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు కోర్ గ్రూప్‌ను ఎంపిక చేసుకుంటే అద్భుతాలు సృష్టించొచ్చన్నారు. సమాజ అవసరాలకు విస్తృత పరిశోధనలు జరగాలంటే కోర్ గ్రూప్‌లో విద్యార్థులు ఎక్కువమంది ఆ రంగంలోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇఇఇ విభాగం హెడ్ డాక్టర్ బిఆర్‌కె.వర్మ, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.కాంతారావు మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న తమ పూర్వ విద్యార్థులతో నిర్వహిస్తున్న అపూర్వ ప్రస్తుత విద్యార్థులకు న్యూటెక్నాలజీని అధ్యయనం చేసేందుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు అల్యూమిని అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ వికె.విశ్వనాధరాజు, డాక్టర్ జి.హరీష్‌కుమార్‌వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఇఇ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన క్రానికల్ సావనీర్‌ను డాక్టర్ రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్‌ను కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు ఘనంగా సత్కరించారు.

కోతల బడ్జెట్‌ను సవరించాలని సిపిఎం ధర్నా

పాలకోడేరులో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కోతల బడ్జెట్‌ని సవరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ అన్ని రంగాలలో కోతలు విధించి కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. ఈ బడ్జెట్‌ను సవరించాలని, లేకపోతే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ, సత్యనారాయణ, నాగలక్ష్మి, మరియమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ప్రయోజనకరంగా లేదని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ విమర్శించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి, సామాన్య ప్రజలకు సంబంధించి వివిధ అంశాల్లో కేటాయింపుల్లో కోతలు విధించడం దారుణమన్నారు. బడ్జెట్‌ను సవరించి ప్రజలపై భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొంతు శంకరం, కంకటాల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే పరమావధి'

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రతి కుటుంబంలో సంతోషమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి చినపేట, కాపులపాలెంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా చినపేటకు వెళ్లే శ్మశాన వాటిక రహదారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ అడ్డాల పెద్దిరాజు, ఎంపిటిసి ఉల్లం జ్యోతి రామాంజనేయులు, సుంకర సీతారాం, పాల సత్తి రామిరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయంగా మహిళలను చైతన్యపరిచేందుకు తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ అధ్యక్షతన స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించారు. మహిళా సంఘం 1938లో కృష్ణా జిల్లాలోని స్వతంత్ర ఉద్యమంలో భాగంగా ప్రారంభమైందని, ప్రజాస్వామ్యం, సమానత్వం స్త్రీ విముక్తి నినాదాలతో దేశవ్యాప్తంగా పెద్ద సంఘంగా 1981లో ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల సభ్యులు ఉన్న ఐద్వా సంఘం ఈ దేశంలో స్త్రీల పట్ల జరిగే సాంఘిక దురాచారాలు ఎదుర్కోవటంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. వరకట్న దురాచారానికి వ్యతిరేకంగా పోరాడుతూ, సెక్షన్ 498ను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాజకీయంగా మహిళలను చైతన్యపరచడానికి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ పోరాటాల్లో మహిళల పాత్ర అంశంపై సరిపల్లి జయప్రభ బోధించగా, మహిళా సంఘం నిర్మాణం అంశాన్ని జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ బోధించారు. ఈ తరగతులకు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.ఉదయ్‌కుమారి, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పావని, బంకుర యశోద, నాగరత్నం, సిహెచ్.వరలక్ష్మి, అడ్డాల మీనాకుమారి, సరోజినీ నాయకత్వం వహించారు.

సర్పంచి కనకదుర్గకు గ్లోబల్ ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - ఉండి

ఎంతో ప్రతిష్టాత్మకమైన జాతీయ బాలీవుడ్ సినీ రిపోర్టర్ సంస్థకు చెందిన గ్లోబల్ ఐకాన్ 2022 అవార్డును ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అందుకున్నారు. కరోనా సమయంలో గ్రామంలో చేసిన సేవలకు, 2022లో గ్రామంలో నిరుపేదలకు చేసిన సేవలకు బాలీవుడ్ సినీ రిపోర్టర్ సంస్థ గుర్తించి తనను గ్లోబల్ ఐకాన్ 2022 అవార్డుకు ఎంపిక చేసిందని సర్పంచి తెలిపారు. ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును తనకు ప్రదానం చేసినట్లు చెప్పారు. తన భర్త, వైసిపి నాయకులు వెంకటాచార్యులు ప్రోత్సాహంతోనే తను సమాజ సేవ చేయగలుగుతున్నానని ఆమె తెలిపారు.

డాక్టర్ స్వర్ణలతకు మరో అరుదైన అవార్డు

అవార్డు అందుకుంటున్న డాక్టర్ డిఆర్.స్వర్ణలత

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు సెయింట్ జోన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలతను మరో అరుదైన అవార్డు వరించింది. సమాజంలో గత 23 ఏళ్ల నుంచి సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించిన ఆదర్శ సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందించింది. సమాజానికి చేస్తున్న సేవలకు, ఒక ఉపాధ్యాయురాలిగా చేస్తున్న సేవలకు గుర్తింపు దక్కింది. వ్యక్తిత్వ వికాస ఉపన్యాసకురాలిగా వివిధ కళాశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న వేలాదిమంది విద్యార్థులకు తరగతులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో స్వర్ణలతను అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికచేసి ఆదర్శ సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు రొక్కల నాగబుజ్జి అందించారు. తణుకు పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును స్వర్ణలత అందుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ తాను సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి అవార్డును అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారంతో తన సేవలను ముందుకు కొనసాగిస్తానని తెలిపారు. అవార్డు రావడం తనపై మరింత బాధ్యతలు పెంచిందని చెప్పారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్పలో జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టిన పంట బోది పనులను ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అనంతరం మస్తార్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వై.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

లబ్ధిదారుల స్థలాల్లో రోడ్డు నిర్మించొద్దు

ప్రజాశక్తి - పెనుమంట్ర

లబ్ధిదారుల ఇళ్ల స్థలంలోకి వచ్చేలా రహదారిని నిర్మించవద్దని సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు డిమాండ్ చేశారు. పెనుమంట్ర శివారు బ్రాహ్మణ చెరువు కొత్త కాలనీలో శనివారం నిర్మిస్తున్న రహదారి తమ స్థలంలోకి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు విచారణ జరిపి దీనికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కోడి శ్రీనివాసప్రసాద్, మాదాసు లక్ష్మణరావు, గంటి వెంకన్న పాల్గొన్నారు.

'వైసిపిని మరింత బలోపేతం చేయాలి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నేతలు పని చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వైసిపి జిల్లా యువత అధ్యక్షుడిగా నియమితులైన కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పదవులు దక్కించుకున్న ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు.

పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా పరమేశ్వరరావు

పరమేశ్వరరావు

ప్రజాశక్తి -పాలకోడేరు

అఖిల భారత పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా గొరగనమూడి గ్రామానికి చెందిన బల్ల పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి శనివారం నియామిక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పరమేశ్వరరావు కోస్తాంధ్ర పద్మశాలి సంఘం జిల్లా యువజన అధ్యక్షులుగా పనిచేశారు. పద్మశాలి సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు. గతంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కార్యవర్గం ఎన్నిక మహాసభ కూడా ఇక్కడే జరిగింది. ఆనాటి నుంచి నేటి వరకు పద్మశాలి సంఘం అభివృద్ధికి పరమేశ్వరరావు అందించిన సేవలను గుర్తించిన సంఘం రాష్ట్ర కమిటీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించింది. మార్చి 12న హైదరాబాద్, నారాయణగూడ, పద్మశాలి భవనంలో నిర్వహించబోయే వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని పరమేశ్వరరావుకు ఆహ్వానం అందింది. దీనిలో భాగంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సంఘం సభ్యులకు అండగా ఉంటానన్నారు. ఉన్నత పదవి మరింత బాధ్యతను పెంచిందన్నారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా పరమేశ్వరరావు నియమకం కావడం పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘం సభ్యులు, గ్రామస్తులు పరమేశ్వరరావును అభినందించారు.

పలుచోట్ల సామూహిక ఎలుకల నిర్మూలన


పెనుమంట్రలో...

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. మార్టేరు ఎడిఎ ఎం.హరిబాబు నెగ్గిపూడిలో, తహశీల్దార్ దండు అశోక్ వర్మ నత్తా రామేశ్వరంలో, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి పెనుమంట్రలో రైతులకు ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మద్దాల జయదుర్గమాధురి మాట్లాడుతూ మండలంలో మొత్తం 15031 ఎకరాల్లో (ఖాళీ ప్రదేశాలతో కలిపి) ఈ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

అత్తిలి : సామూహిక ఎలుకల నివారణ మందును రైతులకు శనివారం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఎఒ రాజేష్ అన్నారు. మండలంలో మొత్తం 14 వేల ఎకరాలకి 69 కేజీలు మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఉండి : సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన శనివారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద బ్రోమోడయోలిన్ మందు తయారీ, పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎఎస్-ఎస్.శ్రీనివాస్ మాట్లాడారు.

కాళ్ల : రబీ వరి సాగులో ఎలుకల బెడద నుంచి రక్షించేందుకు సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని ఎఒ చామర్తి జయవాసుకి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సిసలి, కాళ్ల ఆర్‌బికె వద్ద ఎలుకల నివారణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.

వీరవాసరం : మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయకుదురు పంచాయతీ వద్ద శనివారం ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిబాబు ప్రారంభించారు. మండలంలో 20 రైతు భరోసా కేంద్రాల్లో 69 కేజీల బ్రోమోడయోలిన్ ఎలుకల నివారణ మందును రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఎఒ గీతాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గెడ్డం భారతీ భాస్కరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మానుకొండ ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పంటకు నష్టం కలిగించే ఎలుకల నిర్మూలనకు అన్నదాతలందరూ సామూహికంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారిని ఎం.సుజాత చెప్పారు. శనివారం ఎలుకల నివారణ మందును రైతులకు పంపిణీ చేశారు.

పెనుగొండ : మండలంలోని నడిపూడి గ్రామ పంచాయతీల పరిధిలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి స్పందన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని గవరపేటలో వ్యవసాయ అధికారులు రైతులకు ఎలుకల మందును పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టి పంటను కాపాడుకుని అధిక దిగుబడిని పొందాలని సూచించారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కేపీపాలెం నార్త్ పంచాయతీ పరిధి తంగేళ్ళగూడెంకు చెందిన తంగేళ్ళ యాదగిరి రాజు, తండ్రి: సత్యనారాయణ అను నేను మా ఇంటి వద్ద నుండి పాస్‌పోర్ట్ తీసుకుని నా వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మొగల్తూరు వెళుతుండగా మార్గమధ్యంలో పాస్‌పోర్ట్ నెంబర్ **M3434989 అను నెంబర్ గల నా పాస్ పోర్ట్ పడిపోయినది.** ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

తంగెళ్ల యాదగిరి రాజు
తండ్రి: సత్యనారాయణ, కేపీపాలెం నార్త్, తంగెళ్లగూడెం, మొగల్తూరు మండలం.
సెల్: 95023 94285

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్.నెం. 16/2020

బిట్వీన్:
ది.గోపినాధపట్నం ఇవాంజలికల్ చర్చ్ ఫండేషన్ రిప్రజెంటెడ్ బై ఆర్గనైజర్స్ **...వాది**

మరియు

ది.మోస్ట్ రివరెండ్ కె.పి.యోహనన్ వగైరాలు **...ప్రతివాదులు**

పై నెంబరు గ్రంథములో మొదటి ప్రతివాది అయిన కె.పి. యోహనన్ గారు, తండ్రి: చోకోపినోస్ బిషప్ వేస్ నెం.1 వరిక్కాడు తిరువళ్ళ టౌన్ కేరళ అను వారు దావా సమనులు, నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు **ది.17-03-2023వ తేదీ పగలు గం॥10:00 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట గారి ద్వారా గాని హాజరు కానిచో వారి పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా వారికి తెలియజేయడమైనది.**

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కాజ నాగేశ్వరరావు
తాడేపల్లిగూడెం, 25-2-23. అడ్వకేట్, తాడేపల్లిగూడెం. సెల్: 99895 38628

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తాడేపల్లిగూడెం
ఐ.ఎ.నెం. 197/2022
ఇన్ ఒ.యస్.నెం. 275/2022

బిట్వీన్:
వరుకూటి వెంకట రామారావు **...పిటీషనరు /వాది**

మరియు

దేవ బాలకృష్ణ **...రెస్పాండెంటు /ప్రతివాది**

పై నెంబరు పిటీషనులో శ్రీ కోర్టు వారు రెస్పాండెంటు /ప్రతివాది అయిన దేవ బాలకృష్ణ, తండ్రి: పోలారావు, వ్యాపారం, డో.నెం. 2-36, R/o. జగన్నాధపురం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా అయిన వారు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున వారికి Substituted Service ద్వారా నోటీసు అమలు చేయుటకు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున రెస్పాండెంటు /ప్రతివాది **ది.27-03-2023న ఉదయం గం॥10:30 ని॥లకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై వారి అభ్యంతరములు తెలియజేయగలరు.** లేని ఎడల వారి పరోక్షమున శ్రీకోర్టు వారు తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

జి.కె.దుర్గా దేవి
తాడేపల్లిగూడెం, 25-2-23. అడ్వకేట్, తాడేపల్లిగూడెం. సెల్: 99855 92776

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 268/2015

Between:
గద్దే చంద్రశేఖర్ **-వాది**
Vs
గద్దే మంగరాజు వగైరా **-ప్రతివాదులు**

పై నెంబరు దావాలో ఆరవ ప్రతివాది శ్రీమతి నందిన చంద్రావతి, భర్త లేటు నందిన సత్యనారాయణ, డోర్ నెం. 5-125, ముప్పనవారిగూడెం, బుట్టాయగూడెం మండలం మరియు ఏడవ ప్రతివాది శ్రీమతి ఈడుపుగంటి వీర వెంకట లక్ష్మి, భర్త: ప్రసాదరావు, డోర్ నెం. 7-187, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు సమన్లు పంపినప్పటికి తీసుకొనకుండా Evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఆరవ ప్రతివాది శ్రీమతి నందిన చంద్రావతి, ముప్పనవారిగూడెం, బుట్టాయగూడెం మండలం మరియు ఏడవ ప్రతివాది శ్రీమతి ఈడుపుగంటి వీర వెంకట లక్ష్మి, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు **ది. 20-03-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్య రామారావు**
తేది.20-02-2023 వాది తరపు న్యాయవాది

ప్రకటన

బ్యాంక్ ఆఫ్ ఇండియా, గన్నవరం బ్రాంచి, కృష్ణాజిల్లా వారి సూచనలు మేరకు ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయటమేమనగా దావాజీగూడెం బుద్ధవరం గ్రామ శివారు, గన్నవరం మండల వాస్తవ్యుడు గోపిదేశి మంజుల, భర్త : మాధవ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని విజయవాడకు చెందిన దొప్పలపూడి ప్రవీణ్‌కుమార్, తండ్రి : విష్ణువర్ధనరావు గారి వద్ద దిగువ షెడ్యూలు ఆస్థిని ది.19-1-2023న క్రయం చేసి విక్రయ ఖరారు పొందినారు. షెడ్యూలు ఆస్థి 1. బొచ్చ అప్పారావు, 2. సాంబశివరావు, 3. శ్రీనివాసరావు, 4. శేఖర్ కుమార్, 5. అశోక్ రామకుమార్ గారలు ది. 14-3-1982న విక్రయ దస్తావేజు నెం. 1505/1982గా 1వ పుస్తకం. 1340 వాల్యూమ్, 144 నుండి 147 పేజీలలో స.రి. ఆఫీసు ఏలూరులో రిజిష్టరు కాబడిన దస్తావేజు వాల్యూ క్రయం చేసి అనుభవిస్తున్నంతలో బొచ్చ శ్రీనివాసరావు గారు 11-12-2001న ఇంటెస్టేట్‌గా తన భార్యయైన బొచ్చ సుజాత, కుమారుడు సింహాచలం, కుమార్తె సాయి సౌజన్యలను హిందూ వారసత్వ చట్టం సె.8 ప్రకారం వారసులుగా వదిలి పరమపదించినారు. వారి మరణానంతరం పై క్రయదారులు మరియు బొచ్చ శ్రీనివాసరావుగారి వారసులు ఆర్.ఎస్.నెం. 109/3లో 2.35 సెంట్లు భూమిని ది. 16-07-2014న ఏలూరు స.రి. ఆఫీసులో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. 6109/2014గా దొప్పలపూడి ప్రవీణ్‌కుమార్ గారికి విక్రయించి స్వాధీన పరచగా వారు డి.టి.సి.పి. ఏలూరు వారిచే సి.నెం : 368/2016/E T.L.P. No. 32/2016/E గా లే అవుట్ పొంది ఆస్థిని భూ వినియోగ మార్పిడి చేసుకొని ను ప్లాట్లుగా విభజించి ప్లాటు నెం. 24లో షెడూయలు ఆస్తి గోపిదేశి మంజుల గారికి విక్రయించినారు. కావున ఎవరికైననూ బొచ్చ శ్రీనివాసరావు గారి మరణానికి సంబంధించి, వారి వారసుల ఆస్థి సంక్రమణ సంబంధించి చెల్లదగు, చట్టపరమైన ఎటువంటి ఆక్షేపణ అభ్యంతరములున్ననూ వాటిని రిజిష్టరు పోస్టు తిరుగు రశీదుతో దిగువ చిరునామాకు 7 రోజులలో తెలుపుకోవలయును. గడువు దాటి వచ్చిన అభ్యంతరములు పై బ్యాంకు వారు పొందబోయే తనఖా హక్కులు భంగపరచజాలవు.

షెడ్యూల్ : ఏలూరు జిల్లా, వట్లూరు స.రి. యిలాకా, పెదపాడు మండలం, వసంతవాడ గ్రామపంచాయతీ ఆర్.ఎస్. నెం. 109/3 దాఖలా ప్లాట్ నెం. 24లో 137.872 చ.గ.
తూర్పు : ప్లాట్ నెం. 24 తూర్పు భాగం
దక్షిణం : ప్లాట్ నెం. 25
పడమరం : 33 అడుగుల రోడ్డు
ఉత్తరం : 33 అడుగుల రోడ్డు

పి.ఉమాశంకర్,
న్యాయవాది
డోర్ నెం.23-23-18, శివరావు వీధి,
సత్యనారాయణపురం, విజయవాడ-11
సెల్ : 9490838982